క్లుప్తంగా

పంటల్లో కషాయాలు ఉపయోగించాలి

ఎచ్చెర్ల: ఉడుకు తెగులు రాకుండా పంటల్లో కషాయాలను వాడాలని ప్రకృతి వ్యవసాయం తమ్మినాయుడిపేట యూనిట్ ఇన్‌చార్జి చంద్రకళ తెలిపారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో పంటలకు ఉడుకు తెగులు సోకడం వలన వచ్చే నష్టాలను వివరించారు. దీని నివారణకు వావిలాకు, తూటికాడ కషాయం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీలేని సూత్రాల్లో భాగంగా పసుపు, తెలుపు పల్లాలు, లింగాకర్షక బుట్టలు పెట్టుకుని సరైన సమయంలో కషాయాలను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ ఉన్నతికి కృషిచేస్తా

- పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ్‌గౌరి



మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయ్‌గౌరి

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగం ఉన్నతికి కృషి చేస్తానని, తన గెలుపునకు సహకరించాలని పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ్‌గౌరి కోరారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయులు, లెక్చరర్లను కలిసి తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని ప్రచారం చేశారు. ఆమెతోపాటు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాష్, టి.వైకుంఠరావు, ఎం.గోవిందరావు, శాంతిప్రియ తదితరులు ఉన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



అచ్చమ్మ

శ్రీకాకుళము కల్చరల్: నగరంలోని దమ్మలవీధిలో నివాసముంటున్న పంగా అచ్చమ్మ (70) అనారోగ్యం కారణంగా మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో కుటుంబ సభ్యులు పంగా తవుడు, కోరాడ శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధి బస్వా సతీష్‌లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, సహాయకులు పి.సుమతిలు ఆమె కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సభ్యుడు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: నేరాల నియంత్రణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్డీపీవో సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో జేఆర్ పురం సీఐ ఎం.అవతారం నేతృత్వంలో లావేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు లావేరు మండలంలోని తాళ్లవలస గ్రామంలో 4 సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. పోలీసుల కోరిక మేరకు తాళ్లవలస గ్రామ నాయకుడు ముప్పిడి సురేష్ సీసీ కెమెరాలు వితరణ చేశారు. అలాగే ప్రధాన కూడళ్ల వద్ద గ్రామాల్లో కెమెరాలను ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

గిడుగు వర్ధంతి



గిడుగు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో గిడుగు శ్రీరామమూర్తి 85వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్తబ్రిడ్జి రోడ్డులో ఉన్న గిడుగు విగ్రహానికి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెరవే సభ్యులు గిరిజన యూనివర్సిటీకి గిడుగు రామ్మూర్తి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తెరవే అధ్యక్ష, కార్యదర్శిలు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, ఐఎస్‌డీ ప్రసాద్, ఉమాకవి, పూడి జనార్ధనరావు, వి.రాజారావు, డి.గోవిందరావు, పి.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో బాల్య వివాహాలు నిర్మూలించేందుకు బాల్య వివాహాల నియంత్రణ కమిటీలు పనిచేయాలని ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావు అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ కమిటీల సమావేశం నిర్వహించారు. 18 ఏళ్ల లోపు బాలికల వివాహాల కట్టడికి కృషి చేయాలని, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. బాలికల విద్యను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో డోల పాపినాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.అరుణకుమారి పాల్గొన్నారు.

కల నెరవేరేనా..!

- డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఏళ్లుగా ఎదురుచూపులు
- దూరప్రాంతాలకు వెళ్లలేక విద్యార్థుల అవస్థలు
- పదేళ్లుగా సర్వేలతోనే సరిపెడుతున్న అధికారులు



రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల

రణస్థలం: పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న రణస్థలం ప్రాంతంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఈ ప్రాంత విద్యార్థులు ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తూనే ఉన్నారు. మండలంలో యూనైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీ, ఏపీ టోరియా, శ్రేయాస్, అపర్ణ, ల్యాన్‌టెక్, ఆంధ్రా ఆర్గానిక్స్, శ్యాంపిస్టన్స్ వంటి ఎన్నో పెద్ద పరిశ్రమలతో పాటు చిన్నతరహా పరిశ్రమలు భారీగా ఉన్నాయి. ఉద్యోగం, ఉపాధిపరంగా రణస్థలం మండలం జిల్లాలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ఈ ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ ఘననీయంగా పెరుగుతోంది. అయితే దీనికి అనుగుణంగా సరైన విద్యాలయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రణస్థలం జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆపై ఉన్నత చదువుల కోసం విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంటర్‌తోనే విద్యకు స్వస్తి

రణస్థలం మండలంలో రెండు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అయితే ఈ కళాశాలల్లో ఫీజులు చెల్లించే స్తోమత లేని విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇంటర్‌తోనే చదువుకు స్వస్తి చెబుతున్నారు. ఫలితంగా పైడిభీమవరంలో ఉన్న ప్రముఖ పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందలేకపోతున్నారు. ఈ ప్రాంతంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని 20 ఏళ్లుగా వినతులు అందజేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్నతాధికారులు మండలానికి విచ్చేసి సర్వే చేపట్టి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తదుపరి కొన్ని కారణాల వలన జాప్యం జరిగింది. ఈలోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డిగ్రీ కళాశాల ఏర్పాటుకై మరలా సర్వే చేపట్టారు. అయితే ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సన్నాహాలు జరుగుతున్నాయి

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే స్థల పరిశీలన చేశారు. ఇటీవల డిగ్రీ కళాశాల ఉన్నతాధికారులు విచ్చేసి ఫీజుబులిటీ సర్వే చేపట్టారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరలోనే ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

– జె.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

డిగ్రీ కళాశాల లేక ఇబ్బందులు

రణస్థలంలో డిగ్రీ కళాశాల అవశ్యకతను గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. డిగ్రీ కళాశాల లేకపోవడంతో పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు వెళ్లి చదువుకోవడానికి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఇక్కడే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తుందని ఆశిస్తున్నా.

– గొర్లె అప్పలనాయుడు, సర్పంచ్, కొండములగాం

ప్రజావేదికలో బయటపడిన అక్రమాలు

- చర్యలకు ఉపక్రమించిన అధికారులు



ఆడిట్ సమావేశం జరుగుతున్న దృశ్యం



సమావేశానికి హాజరైన ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి 17వ సోషల్ ఆడిట్ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగింది. శ్రీకాకుళం మండలంలోని 23 పంచాయతీలకు సంబంధించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు గాను మొత్తంగా రూ.18,67,49,590 ఖర్చు అయినట్లు శ్రీకాకుళం మండల ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు లెక్కలు చూపించారు. అయితే ఈ సందర్భంగా ఒక్కొక్క పంచాయతీకి సంబంధించిన ఆడిట్ వివరాలు వెలుగులోకి రావడంతో అధికారులకు చెమటలు పట్టాయి.

అక్రమాలు ఇలా...

- సానివాడ గ్రామంలో ఉపాధి మేట్ అంబటి అసిరినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో 24 మంది వేతనదారులకు పనిచేయకుండానే మస్టర్లు వేసి నగదు చెల్లించినట్లు డీఆర్పీ ఎస్.చంద్రరావు ఆడిట్ సమావేశంలో వెల్లడించారు.
- కరజాడ బైరి గ్రామాల్లో మధ్యాహ్న భోజనానికి పనిచేస్తున్న ఆయాలకు కూడా మస్టర్లు వేసి వేతనాలు చెల్లించినట్లు ఆడిట్ సమావేశంలో వెలుగులోకి వచ్చింది.
- 23 పంచాయతీల్లోనూ చాలాచోట్ల దిద్దుబాట్లు ఉన్నట్లు ఆడిట్‌లో వెలుగు చూసింది.
- కుందువానిపేట గ్రామంలో ఉపాధి హామీ పనికి ఆలస్యంగా వెళ్లినవారి వద్ద నుంచి రూ.100లు అక్రమ వసూళ్లకు ఫీల్డు అసిస్టెంట్, మేట్ పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది.
- కరజాడ గ్రామంలో చెరువు పని చేశాక దాన్ని ప్రొక్లెయిన్ మెషిన్‌తో కప్పించేశారని ఆడిట్‌లో బయటపడింది.
- 23 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఎస్టిమేట్‌లో క్వాంటిటీ కంటే ఎంబుక్సులో ఎక్కువగా రికార్డు చేసి పేమెంట్లు చేసినట్లు అధికారులు గ్రహించారు. దీంతో అవకతవకలు జరిగిన గ్రామాలు, పంచాయతీలపై విచారణ కొనసాగుతోందని అధికారులకు వెల్లడించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకర్, డీవీవీవో స్వరూపరాణి, ఏపీడీ శైలజ, ఏఆర్పీ తిరుపతిరావు, ఎంపీడీవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

గార: పంటల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని, లేకుంటే రానున్న రోజుల్లో అనేక నష్టాలు తప్పవని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.త్రినాథస్వామి అన్నారు. మండలంలోని గొంటి పంచాయతీలో మొక్కజొన్న సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రవేత్తల సూచనల మేరకు వాడాల్సిన స్థాయికంటే రెట్టింపు స్థాయిలో యూరియా వాడేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దీనివలన భూమి స్వరూపం మారుతోందని, తెగుళ్లు, పురుగుల తాకిడి పెరుగుతోందన్నారు. జనవరి 31 వరకే మొక్కజొన్న విత్తేందుకు అనుకూలమని, ఆ తర్వాత విత్తడం వలన దిగుబడి తగ్గుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 14,500 హెక్టార్లు మొక్కజొన్న విత్తడం జరిగిందన్నారు. రబీ పంటలపై రైతులకు వ్యవసాయ అధికారులు సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్ల శ్రీనివాసరావు, ఏవో డి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతకు ప్రాధాన్యమివ్వాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సందీప్ తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: వాహన చోదకులు రోడ్డు భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ అన్నారు. చిలకపాలేంలో నాగార్జున అగ్రికెం పరిశ్రమ ఉద్యోగులు, ఇతర వాహన చోదకులకు రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. వాహన చోదకులు ప్రాణం విలువ గుర్తించాలన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.

సమాజంపై రచనల ప్రభావం



నిఘంటువు విడుదల చేస్తున్న వీసీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకటరమణమూర్తి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా అధ్యయన వేత్త డాక్టర్ అల్లాకెట్టి చంద్రశేఖర్‌రావు రచించిన నిఘంటువు విడుదల చేశారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



ఎన్‌టీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో, ఆ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించేందుకు నిరంతరం పాటుపడాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆ సంఘ ప్రతినిధులతో కలిసి డీఈవో తన ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యలపై ఎన్‌టీఏ పోరాట తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గొర్ల భూషణరావు, జిల్లా అధ్యక్షుడు సూర పాపారావు, మహిళా అధ్యక్షురాలు వి.శారద, కవిటి ఎంఈవో–2 సురేష్‌కుమార్, ఈటీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జాతర గోడ పత్రిక ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

రణస్థలం: ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 9 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతరకు సంబంధించిన గోడ పత్రికను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా వ్యాపారస్తులు ముందస్తుగా వచ్చి వ్యాపార స్థలాలు బాగు చేసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, సూర్య తేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శి మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్ కుమార్, సింహాచలరాయుడు, మౌళి, గురాల రఘునాథ్, మన్నె వరహామూర్తి, గోపిన కృష్ణారావు, నడుకుదిటి గిరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా గురుకులాల కో–ఆర్డినేటర్ బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో జిల్లాస్థాయి తొమ్మిది అంబేడ్కర్ గురుకులాల ఉపాధ్యాయులకు శతశాతం ఫలితాల సాధనపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా స్లో లెర్నర్స్‌కు 35 మార్కుల సాధారణ ట్రిక్స్‌ను వివరించారు. కనీసం 35 మార్కులు ప్రతీ సబ్జెక్టులో సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. స్లిప్ టెస్ట్‌ల నిర్వహణ, లోపాల విశ్లేషణ, ప్రాధాన్యత గల పాఠ్యాంశాలపై ప్రత్యేక శిక్షణపై అవగాహన కల్పించారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ అవ్వకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దుప్పలవలస ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు, రిసోర్సు పర్సన్లు సంతోష్‌కుమార్, రవికుమార్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



శ్రీకాకుళం రూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



జి.సిగడాం: మూగజీవాలకు వైద్య సేవలను అందిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ సూచించారు. మండలంలోని సేతుభీమవరం, పాలఖండ్యాం గ్రామాల్లో మండల పశువైద్యాధికారి ఉప్పాడ సుమన్, మీసాల జానికీరాంల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూగజీవులకు వివిధ రకాల వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధారబోయిన ధర్మారాజ్, తొత్తడి రామారావు, వైద్య సిబ్బంది బాలి లక్ష్మణనాయుడు, అనకాపల్లి జనార్దనరావు, మడాన శారద తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కల్లేపల్లి, పొన్నాం పంచాయతీల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు వైద్యులు పశువులు, మేకలు, కోళ్లకు ఉచిత టీకాలు వేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయానంద్, మూకళ్ల శ్రీనివాసరావు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పశువైద్య శిబిరాల పోస్టర్లు ఆవిష్కరించారు.


అవగాహన



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ఉపయోగించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని గాయత్రీ కాలేజీలో రోడ్డు భద్రత వారోత్సవాల అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల కరస్పాండెంట్ అంబటి రాంగారావు, కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం రూరల్

వెలగని ఎల్‌ఈడీ లైట్లు



జాతీయ రహదారిపై చాలా చోట్ల ఎల్‌ఈడీ విద్యుత్ లైట్లు వెలగడం లేదు. ఫరీదుపేట కూడలి నుంచి కేశవరావుపేట కూడలి కింతలిమిల్లు వరకు ఇదే పరిస్థితి ఉంది. రోడ్డు పక్కన ఇళ్లు ఉండడం, జనావాస ప్రాంతాలు కావడంతో లైట్లు కీలకం. దీంతోపాటు పొగమంచు కురుస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతమంతా చీకటిమయంగా మారుతోంది. అందువలన లైట్లు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పర్యావరణానికి చేటు



పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాల్సింది పోయి ఉన్న చెట్లను నరికేస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారు. శ్రీకాకుళం నగరంలోని సానా వీధికి సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఒక ద్విచక్ర వాహన షోరూమ్ వద్ద రోడ్డు పక్కన ఉన్నచెట్లు పూర్తిగా నరికేశారు. వాస్తవానికి షోరూమ్ లోపల ఖాళీస్థలం ఉన్నప్పటికీ కాలువ పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పచ్చని చెట్టుని తొలగించేశారు. అటువైపుగా వెళ్లే ప్రయాణికులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. దీంతో ఇటువంటి వాటిపై అధికారులు చొరవ చూపి పర్యావరణాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ఉత్సాహంగా కబడ్డీ జట్ల ఎంపిక

- ఈనెల 25 నుంచి విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలు



ఎంపికైన బాలికలతో కబడ్డీ సంఘ ప్రతినిధులు, సెలెక్టర్లు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల కబడ్డీ జట్ల ఎంపికలు ఉత్సాహ భరితంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఎంపికైన జట్ల వివరాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యార్లగడ్డ వెంకన్నచౌదరి, ప్రధాన కార్యదర్శి అక్కేని చిరంజీవిరావు వెల్లడించారు. ఎంపికైనవారిని ఈనెల 25 నుంచి 27 వరకు విశాఖపట్నం జిల్లాలోని అంకుపాలెం వేదికగా జరిగే 71వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో సీనియర్ క్రీడాకారులు ఆర్.అప్పలస్వామి, బి.రామకృష్ణ, ఎండీ కృష్ణ, బి.కృష్ణ, పీడీలు ఎం.నీలాద్రి, టి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జట్ల వివరాలు

- పురుషుల జట్టు: శంకర్, పృథ్వీ, దొరబాబు (ఎల్.కొత్తూరు), తేజ (పొన్నాడ), పవన్ (బాహడపల్లి), కేశవ, మణికంఠ (కవిటి), కిషన్ (బలగ), పవన్ (తాళ్లభద్ర), రామకృష్ణ (నరసన్నపేట), శ్రీను (పైడి భీమవరం), సతీష్ (కొవ్వాడ).
- మహిళల జట్టు: హేమలత (బలగ), ఆదిలక్ష్మి, దేవి, హారిణి (బెజ్జిపురం), రమాదేవి (శ్రీకూర్మం), శైలజ, నీరజ (మహంతిపాలెం), రేణుక (ఇసకలపాలేం), స్రవంతి, హారిక (బారువ), ఢిల్లేశ్వరి (కేజీబీవీ రణస్థలం), జ్యోతి (పైడి భీమవరం) ఎంపికై నవారిలో ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని బలగలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి క్షీరాభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పాత శ్రీకాకుళంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో బుధవారం 100 అడుగుల ఎత్తుగల వెంకటి సాయికోటి మహాస్తూపం 23వ వార్షికోత్సవం, 46 అడుగుల నాగసాయి విగ్రహం 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట గ్రామంలో గాయిత్రీదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి బుధవారం కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బచ్చు నర్సింగరెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వామిజీల రాక



ప్రారంభానికి సిద్ధమైన కళావేదిక

శ్రీకాకుళం కల్చరల్: దత్తపీఠాధిపతులు గణపతి సచ్చిదానంద స్వామిజీ, దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామిజీలు జిల్లా కేంద్రంలోని చిం దత్త క్షేత్రానికి గురువారం రానున్న సందర్భంగా భారీగా స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీరు 23, 24 తేదీల్లో శ్రీకాకుళం విచ్చేసి ఇక్కడి భక్తులకు ఆశీర్వాదాలు అందించి, జిల్లా సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో హోమాలు, ప్రవచనాలు నిర్వహిస్తారు. గణపతి సచ్చిదానంద స్వామిజీ తన మ్యూజిక్ థెరపీ ద్వారా ఎటువంటి రోగాలనైనా నయం చేసే చికిత్స విధానాన్ని చేసేందుకు వస్తున్నారు. చిం దత్త క్షేత్రం ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మించిన నూతన యాగశాల, ప్రాంగణం కళావేదిక, నాగేంద్ర దేవాలయాన్ని స్వామీజీలు ప్రారంభిస్తారు. అనంతరం స్వామీజీ అనుగ్రహ భాషణ చేస్తారు. అదేవిధంగా స్వామీజీ దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఉచితంగా వసతి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 5 వేల మంది భక్తులు వస్తారని అంచనాతో వారందరికి భోజన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.